కాంగ్రెస్‌కు విధేయుడు మన్మోహన్

- ఎవరు కించపరచినా చలించలేదు..
- తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక
- అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు
- స్కిల్ యూనివర్సిటీకి మాజీప్రధాని పేరు పెట్టాలని ప్రతిపాదన

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో ఎన్ని ఇబ్బందులెదుర్కొన్నా, ఏనాడూ ఆ పార్టీని ఒక్క మాట కూడా అనని వీర విధేయుడు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు కొనియాడారు. శాసనసభలో సోమవారం మన్మోహన్‌సింగ్‌కు సంతాపం తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడారు. మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలనే తీర్మానాన్ని బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణంగా బలపరుస్తున్నదని తెలిపారు. ప్రధానిగా, ఆర్థికమంత్రిగా, ఇతర కీలకపదవులను చేపట్టి మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలను శ్లాఘించారు. 'ఒకనాడు కాంగ్రెస్ పార్టీ ఓడిపోతే, ఆ ఓటమికి మన్మోహన్‌సింగ్, పీవీ ఆర్థిక విధానాలు కారణమని ఆంటోనీ కమిటీ రిపోర్టు ఇచ్చింది. దానిపై ఏఐసీసీలో చర్చపెడితే మన్మోహన్ కంటతడి పెట్టారే తప్ప, తనను కాంగ్రెస్ నాయకులే తప్పుపట్టారని బాధపడలేదు. పార్టీకి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడలేదు. ఆనాడు మన్మోహన్‌సింగ్ కంటతడి పెట్టిన వార్తపై దేశమంతా చర్చ జరిగింది' అని హరీశ్‌రావు గుర్తుచేశారు. 'మరో సందర్భంలో యూపీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న లాలూప్రసాద్ యాదవ్‌కు రెండేండ్ల జైలు శిక్ష పడితే, లాలూను రక్షించేందుకు ఒక ఆర్డినెన్స్ తీసుకొచ్చారు. ప్రధానిగా మన్మోహన్ నిర్ణయం సరైందేనంటూ ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు ప్రెస్‌మీట్ పెట్టారు. హఠాత్తుగా అక్కడికి వచ్చిన రాహుల్‌గాంధీ ఆ ఆర్డినెన్స్ కాపీలను చింపివేశారు. ఒక ప్రధానిగా మన్మోహన్‌సింగ్, ఆయన క్యాబినెట్ నిర్ణయం తీసుకుంటే, దానిని కాంగ్రెస్ నేతగా ఉన్న రాహుల్‌గాంధీ తప్పుపట్టారు. అయినా, మన్మోహన్ మౌన మునిలానే ఉన్నారు తప్ప, నోరు తెరిచి ఒక్క మాట కూడా అనలేదు. అందుకే కాంగ్రెస్ వీర విధేయుడు మన్మోహన్‌సింగ్' అని వివరించారు. రెండోసారి ఏర్పాటైన యూపీఏ ప్రభుత్వంలో చాలా కుంభకోణాలు, కేసులు, అరెస్టులు జరిగాయని, కానీ ప్రధానిగా ఉన్న మన్మోహన్‌సింగ్‌పై ఒక చిన్న మచ్చకూడా పడలేదని, అది ఆయన గొప్పతనమేనని కొనియాడారు. కేంద్ర క్యాబినెట్లో చేరిన కేసీఆర్‌కు నౌకాయాన శాఖను ఇచ్చారని, డీఎంకే పార్టీకి ఆ శాఖను త్యాగం చేసిన కేసీఆర్ తెలంగాణ కోసం ఆరు నెలలపాటు శాఖ లేని మంత్రిగా ఉన్నారని, ఈ సందర్భంగా కేసీఆర్‌ను మన్మోహన్‌సింగ్ ప్రశంసించారని హరీశ్‌రావు గుర్తుచేశారు.

పీవీని పట్టించుకోలేదు

మన్మోహన్‌సింగ్‌ను తన క్యాబినెట్లోకి ఆర్థికమంత్రిగా తీసుకొని, దేశ రాజకీయాలకు పరిచయం చేసింది తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నర్సింహరావని చెప్పారు. పీవీ నమ్మకాన్ని నిలిపిన మన్మోహన్ దేశ ఆర్థిక రంగానికి దశ, దిశను చూపారని కొనియాడారు. కారణాలేమోగానీ పీవీ మరణించిన రోజు కాంగ్రెస్ పట్టించుకోలేదని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆరే పీవీ ఘాట్‌ను, పీవీ పేరిట యూనివర్సిటీని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. పీవీ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయించి, ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా జరిపించింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనేనని వివరించారు. పీవీ శతజయంతి ఉత్సవాలను ఘనంగా జరిపి, మన పీవీ, మన ఠీవి అని ఆయన ఖ్యాతిని ప్రపంచానికి చాటిన ఘనత కూడా కేసీఆర్‌దేనని హరీశ్‌రావు కొనియాడారు. మన్మోహన్‌సింగ్ చరిత్రలో నిలిచిపోతారని అంటూ వారి కుటుంబీకులకు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

స్కిల్ యూనివర్సిటీకి పేరు పెట్టాలి..

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరిట ఒక స్మారకాన్ని, విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని హరీశ్‌రావు స్వాగతించారు. అదే సమయంలో ప్రభుత్వానికి మరో సూచన కూడా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయనున్న స్కిల్ యూనివర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలని ప్రతిపాదించారు. దీనిని బీఆర్ఎస్ నేతలే కాకుండా, కాంగ్రెస్ నేతలు కూడా స్వాగతించారు.

మండలిలోనూ పెడితే బాగుండేది..

మన్మోహన్‌సింగ్ సుదీర్ఘకాలం రాజ్యసభలో మెంబర్‌గా కొనసాగారని, పెద్దల సభలో 33 సంవత్సరాలు సేవలు అందించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. శాసనసభతోపాటు రాష్ట్ర శాసనమండలిలో కూడా సంతాప సమావేశాన్ని ఏర్పాటు చేస్తే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనేక మంది ఎమ్మెల్సీలు కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారని గుర్తుచేశారు.

కేసీఆర్‌కు మీరిచ్చిన గౌరవమేది..?

- పీఏసీ చైర్మన్ నియామకమప్పుడు ఎందుకు ఫోన్ చేయలె
- ఎమ్మెల్యేల అనర్హతపై ఎందుకు స్పందించలేదు
- స్పీకర్ ప్రసాద్‌ను ప్రశ్నించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్30 (నమస్తే తెలంగాణ): 'మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ ఉద్యమకారుడు కేసీఆర్‌కు మీరిచ్చిన గౌరవమేది' అంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. మన్మోహన్‌సింగ్‌కు సంతాప తీర్మానంపై హరీశ్‌రావు మాట్లాడుతూ.. యూపీఏ సర్కార్ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో తెలంగాణ ఏర్పాటు అంశాన్ని చేర్చడం, ఆ క్రమంలో కేసీఆర్ కృషిని, మన్మోహన్‌సింగ్ ఔన్నత్యాన్ని వివరించే ప్రయత్నం చేశారు. అయితే మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని కేవలం మన్మోహన్‌సింగ్ అంశానికే పరిమితం కావాలంటూ అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనిని స్పీకర్ గడ్డం ప్రసాద్ సమర్థిస్తూ.. సంతాప తీర్మానం అంశానికే పరిమితం కావాలని హరీశ్‌రావుకు సూచించారు. ఈ సమావేశానికి రావాలని స్వయంగా తానే కేసీఆర్‌కు ఫోన్ చేశానని, ఆయినప్పటికీ రాలేదని, ఇదేనా గౌరవం అంటూ స్పీకర్ వ్యాఖ్యానించారు. దీనిపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ ఉద్యమకారుడు, ప్రధాన ప్రతిపక్షనేత కేసీఆర్‌కు మీరిచ్చిన గౌరవమేదని ప్రశ్నించారు. పీఏసీ చైర్మన్ నియామకం సందర్భంగా ఎందుకు ఫోన్ చేయలేదని నిలదీశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటువేయాలని కోరినా ఎందుకు స్పందించలేదని మండిపడ్డారు. రాజకీయాలకు ఇది సందర్భం కాదని అంటూ.. తిరిగి సంతాప తీర్మానంపై ప్రసంగాన్ని కొనసాగించారు.

పీవీకి మరోసారి కాంగ్రెస్ అవమానం

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుపై కాంగ్రెస్ పార్టీకి ప్రేమ లేదని మరోసారి స్పష్టమైందని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి అసెంబ్లీలో సంతాపం తెలిపి, ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని గాడిలో పెట్టిన పీవీ నరసింహారావు గురించి మాత్రం ప్రభుత్వం మాట్లాడకపోవడం శోచనీయమని మండిపడ్డారు. మాజీ ప్రధానులకు ఢిల్లీలో స్మారకాలు ఉన్నాయని, పీవీ నరసింహారావుకు మాత్రమే లేదని కేటీఆర్ అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఢిల్లీలో పీవీ స్మారకంపై కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదని పేర్కొన్నారు. పీవీ కుటుంబసభ్యులకు, తెలంగాణ సమాజానికి కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రపంచంలో భారత్‌ను ఉన్నతమైన ఆర్థికశక్తిగా నిలిపిన ఆర్థిక సంస్కరణల పితామహుడని సెస్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ హనుమంతరావు ప్రశంసించారు. బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో సోమవారం మన్మోహన్‌సింగ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ, ఆధార్ కార్డు వంటి విప్లవాత్మక చట్టాలను రూపొందించిన ఆర్థిక ప్రగతిశీలి మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి నిస్వార్థ సేవ చేశారని గుర్తుచేసుకున్నారు. ప్రొఫెసర్ మహేందర్‌రెడ్డి, ఆర్థిక శాఖ మాజీ సలహాదారు డాక్టర్ జీ ఆర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ రేవతి పాల్గొన్నారు.

సింపుల్ లివింగ్.. హై థింకింగ్

- ప్రపంచం ఆశ్చర్యపడేలా దేశాన్ని తీర్చిదిద్దిన ఆర్థికవేత్త
- మన్మోహన్ 'సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మాడ్రన్ ఇండియా'
- మాజీ ప్రధానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘన నివాళి
- ఢిల్లీలో పీవీ స్మారకం నిర్మించాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలి

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): దేశంలో కేవలం 15 రోజులు మాత్రమే ఫారెక్స్ నిల్వలున్న పరిస్థితుల్లో తన ఆర్థిక సంస్కరణలతో ప్రపంచమంతా ఆశ్చర్యపడే స్థాయికి దేశాన్ని పరుగెత్తించిన ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కొనియాడారు. అసెంబ్లీలో సోమవారం మాజీ ప్రధానికి సంతాపం తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడుతూ.. అనవసరపు డాంభికాలు, ఆర్భాటాలు, హడావుడి లేకుండా సింపుల్ లివింగ్.. హై థింకింగ్ అనే మాటకు పర్యాయపదంగా మన్మోహన్‌సింగ్‌ను చెప్పుకోవచ్చని అన్నారు. ఆయన ప్రధానిగా ఉన్న కాలంలోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఏడాదిన్నరపాటు వారి క్యాబినెట్‌లో కేంద్రమంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. 'తెలంగాణ ఉద్యమంలో ఉన్న నిబద్ధత, ఉద్యమానికి ఉన్న బలం, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తి.. అన్నీ మన్మోహన్‌కు అర్థమయ్యాయి. కాబట్టే అనివార్య పరిస్థితుల్లో ఆయన నాయకత్వంలోనే తెలంగాణ ఏర్పడింది' అని పేర్కొన్నారు. ఎన్నడూ, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా సంస్కరణల బాట నుంచి వెనక్కి తగ్గలేదని, ఆయనను 'సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మాడ్రన్ ఇండియా' అని పిలువవచ్చని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ గురించి మాట్లాడుకునేటప్పుడు మన తెలుగు బిడ్డ.. తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు గురించి కూడా గుర్తుచేసుకోవాలని చెప్పారు. మన్మోహన్‌సింగ్ గొప్పదనాన్ని, సామర్థ్యాన్ని, తెలివితేటలను గుర్తించే పీవీ నర్సింహారావు రాజకీయాల్లోకి తీసుకువచ్చి నేరుగా ఆర్థిక మంత్రిగా నియమించారని గుర్తుచేశారు. 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు నేను, మా పార్టీ రాజ్యసభ సభ్యుల బృందం ఢిల్లీకి వెళ్లి మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులర్పించాం. ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నాం. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించాం. మా సానుభూతి వ్యక్తం చేశాం. ఢిల్లీలో మన్మోహన్‌సింగ్‌కు జరిగిన గౌరవప్రదమైన వీడ్కోలు మన పీవీకి జరుగలేదనే బాధ కలిగింది. మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలని, విగ్రహం పెడతామని సీఎం ప్రకటించారు. మేం స్వాగతిస్తున్నాం. ఆయా కార్యక్రమాల్లో మేం కూడా పాల్గొంటాం. మనవాడైన పీవీ నరసింహారావుకు కూడా ఢిల్లీలో స్మారకం ఏర్పాటుచేయాలని తెలంగాణ శాసనసభ తీర్మానం చేయాలి. మన తెలుగు, తెలంగాణ బిడ్డకు సముచిత గౌరవం కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలనే ప్రతిపాదన అసెంబ్లీ నుంచి పంపిస్తే బాగుంటుంది' అని కేటీఆర్ సూచించారు.

కేటీఆర్‌కు సీపీఐ నేత కూనంనేని ప్రశంస

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీ వేదికగా ప్రశంసించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప తీర్మానంపై మాట్లాడే సమయంలో తొలుత బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి రాజకీయవిమర్శలకు దిగారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. సంతాప తీర్మానం సమావేశంలో రాజకీయ విమర్శలకు దిగడం ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఎంతో హుందాగా వ్యవహరించడంతోపాటు, చక్కగా మాట్లాడారని ప్రశంసించారు.

మన్మోహన్‌పై కాంగ్రెస్ దొంగప్రేమ

- మాజీ పీఎం మృతిపై దగాకోరు రాజకీయం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, ఆమె కుటుంబం, ఆ పార్టీ నేతలు రాజకీయాలు చేయడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఈ వైఖరి కాంగ్రెస్ సంస్కారహీనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "మన్మోహన్ మరణించినట్టు తెలియగానే మాజీప్రధాని వాజ్‌పేయికి నిర్వహించినట్టుగానే అంతిమ సంస్కారాలు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రమంత్రి అమిత్‌షా నేతృత్వంలో అంత్యక్రియలకు ఏర్పాట్లు జరిగాయి. మన్మోహన్ స్మారక కేంద్రం, ఓ ట్రస్టు ఏర్పాటు చేయడం గురించి కూడా మన్మోహన్ సతీమణితో అమిత్‌షా మాట్లాడారు" అని వెల్లడించారు. మన్మోహన్‌సింగ్ అంతిమ సంస్కారాల విషయంలో నరేంద్రమోదీ ప్రభుత్వం నిబంధనలు పాటించిందని తెలిపారు. ఇటీవల ప్రతీ విషయాన్ని రాజకీయం చేయడం, బోర్లాపడడం రాహుల్‌కు అలవాటైందని ఎద్దేవాచేశారు. రాహుల్‌ది అహంకారపూరిత, దివాలాకోరుతనమని ధ్వజమెత్తారు. మాజీప్రధాని పీవీ నరసింహారావు, మాజీరాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణించినప్పుడు అవమానకరంగా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మన్మోహన్‌సింగ్ విషయంలో మొసలికన్నీరు కారుస్తున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు రాజకీయం కోసం మన్మోహన్‌పై దొంగప్రేమను ఒలకబోస్తున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ హయాంలోనే ఆర్ఆర్ఆర్ పనులు

రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)కు సంబంధించిన పనులు దాదాపు మూడేండ్ల కిందట బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయని కిషన్‌రెడ్డి తెలిపారు. ఉత్తరభాగం భూసేకరణ దాదాపు పూర్తయిందని చెప్పారు. భూసేకరణ అక్కడక్కడ కొంత మిగిలిపోయిందని, ప్రస్తుత ప్రభుత్వం సహకరించి పూర్తి చేయాలని కోరారు.

రాష్ట్రంలో 14 శాతం కమిషన్ సర్కారు

- కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

విద్యానగర్, డిసెంబర్ 30: కమీషన్లకు కేరాఫ్ కాంగ్రెస్ సర్కారు అని, రాష్ట్రంలో ప్రభుత్వానికి సంబంధించి ఏ బిల్లు మంజూరు కావాలన్నా 8 నుంచి 14 శాతం కమీషన్లు ముక్కుపిండి వసూలు చేస్తున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. సోమవారం తాజా మాజీ సర్పంచుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు అక్కినపల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్‌ను కలిసి వినతి పత్రం అందశారు. మాజీ సర్పంచులు ప్రజల కోసమే సొంత డబ్బు ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేశారని, వారందరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శాంతి భద్రతలను కాపాడలేని అసమర్థ సర్కారుకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారన్నారు.

భారతరత్నం మన్మోహన్‌సింగ్

మొదటిపేజీ తరువాయి...

కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమమైందని అన్నారు. '60 ఏండ్ల కలను సాకారం చేసిన నాయకుడు, తెలంగాణ ఏర్పాటు బిల్లును రెండు సభల్లో పాస్ చేయించిన సారథి' అని కొనియాడారు. తెలంగాణతో ఆయన బంధం విడదీయరానిదని, తెలంగాణకు పురుడుపోసిన డాక్టర్ అని పేర్కొన్నారు. మన్మోహన్‌ను తెలంగాణ ఆత్మబంధువుగా అభివర్ణించారు. తెలంగాణ ప్రజల గుండెల్లో మన్మోహన్ స్థానం శాశ్వతంగా ఉంటుందని చెప్పారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) విధానాలతో ఆర్థిక వ్యవస్థ స్థితిగతులను మార్చారని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని తొలుత అనంతపురం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ప్రారంభించారని గుర్తుచేశారు. రాష్ట్రం లో మన్మోహన్ విగ్రహాన్ని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేయాలనుకుంటున్నామని, ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందో సభ్యులు సూచనలు, సలహాలివ్వాలని కోరారు.

ఉపాధి పథకం దేశ స్థితినే మార్చేసింది: భట్టి

సరళీకృత ఆర్థిక విధానాలతో మన్మోహన్ సింగ్ దేశాన్ని బలమైన శక్తిని నిలిపారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఉపాధి హామీ పథకం దేశ స్థితినే మార్చేసిందని చెప్పారు. చేపట్టిన ప్రతి పదవికి ఆయన వన్నె తెచ్చారని గుర్తుచేశారు. సామాన్యుడు సమాచారాన్ని తెలుసుకునేలా ఆర్టీఐ యాక్ట్-2005ను తీసుకొచ్చారని, మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం ఆయన పేరు చిరస్థాయిగా ఉంటుందని, దేశ ఆర్థిక పరిస్థితులే కాకుండా సామాజిక పరిస్థితులను అర్థం చేసుకొని అనేక చట్టాలు తెచ్చారని గుర్తుచేశారు.

చిరస్మరణీయులు మన్మోహన్: మంత్రులు

సంతాప తీర్మానంపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్థికశాఖ మంత్రిగా, ప్రధానిగా దేశానికి మన్మోహన్‌సింగ్ చేసిన సేవలను శ్లాఘించారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం తరపున ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, బీజేపీ తరపున ఎమ్మెల్యే కే వెంకటరమణారెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి సంతాప తీర్మానంపై మాట్లాడారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సేవలతోపాటు, వ్యక్తిగతంగా తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలన్న తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు.

ఎవరు మీరు?

రేవంత్‌ను ప్రశ్నించిన మన్మోహన్ కుమార్తె

అసెంబ్లీలో వెల్లడించిన ముఖ్యమంత్రి

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ రెండో కుమార్తె తనను 'మీరెవరు?' అని ప్రశ్నించి, తన గురించి తెలుసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. మన్మోహన్ మృతికి సంతాపం తెలిపే తీర్మానంపై అసెంబ్లీలో సోమవారం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మాజీ ప్రధాని అంత్యక్రియల్లో పాల్గొన్న సమయంలో తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. మన్మోహన్ కుటుంబం నిరాడంబరతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. అంతకు ముందురోజు మన్మోహన్‌సింగ్ భౌతికకాయాన్ని సందర్శించిన సమయంలో ఆయన సతీమణి దగ్గరికి వెళ్లి తాను రేవంత్‌రెడ్డి, తెలంగాణ ముఖ్యమంత్రినని పరిచయం చేసుకుని మాట్లాడినట్టు చెప్పారు. మన్మోహన్‌సింగ్‌కు తెలంగాణ అంటే ప్రత్యేకమైన అభిమానమని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని మన్మోహన్ సతీమణి తనకు ఉద్బోధించినట్టు సీఎం వివరించారు. అయితే సీఎం మాట్లాడిన ఈ అంశాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పలువురు సీఎం వ్యాఖ్యలను ట్రోల్ చేయడం కనిపించింది.

'గాంధీ'లో కట్టు కథ!

- సర్జరీ చేసినమన్నరు..పట్టీ కట్టి పంపిండ్రు..
- ఆపరేషన్ కోసం ఆరుగురి రక్తం తీసుకున్నరు
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం
- 'గాంధీ' సూపరింటెండెంట్ రాజకుమారి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబరు 30 (నమస్తే తెలంగాణ): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితురాలికి సర్జరీ చేస్తామని చెప్పి థియేటర్‌కు తీసుకెళ్లిన గాంధీ వైద్యశాల సిబ్బంది.. ఎలాంటి ఆపరేషన్ చేయకుండానే పట్టీ కట్టి సర్జరీ చేసినట్టు నమ్మించారని బాధిత మహిళ కుటుంబీకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎంతకీ నొప్పి తగ్గకపోవడంతో వైద్యులకు చెప్పినా పట్టించుకోలేదని, విధిలేక అక్కడి నుంచి వేరే దవాఖానకు వెళ్తే అసలు విషయం తెలిసిందని వాపోయారు. అక్కడి వైద్యులు పట్టీ విప్పి చూసి అసలు సర్జరీయే చేయలేదని, చెయ్యి మొత్తం కుళ్లిపోయిందని, దాన్ని పూర్తిగా తొలగించాలంటున్నారని బోరున విలపిస్తున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఎదిరపల్లికి చెందిన రేవతమ్మ(50), వెంకటయ్య దంపతులు దినసరి కూలీలు. ఈ నెల 21న రేవతమ్మ జడ్చర్లలోని తన సోదరి ఇంటికి వెళ్లి సాయంత్రం వస్తునన క్రమంలో ఆర్టీసీ బస్సు ఎక్కుతూ జారీ కింద పడిపోయింది. ఈ ఘటనలో రేవతమ్మ ఎడమ చెయ్యికి తీవ్ర గాయమైంది. ఆమెను కుటుంబసభ్యులు ముందుగా మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా లేదా గాంధీకి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు రెఫర్ చేశారు. అదే రోజు రాత్రి ఆమెను గాంధీకి తీసుకెళ్లగా అత్యవసర విభాగంలో చేర్చుకున్న వైద్యులు, చెయ్యి పూర్తిగా దెబ్బతిన్నదని చెప్పారు. మరుసటి రోజు కుటుంబ సభ్యులను పిలిపించి రోగికి 23న ప్లాస్టిక్ సర్జరీ చేస్తామని, రక్తం అవసరం ఉంటుందని, ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 23న ఉదయం రోగి బంధువులు ఆరుగురు దవాఖానకు చేరుకున్నారు.

రక్తం ఇచ్చి వచ్చే లోపే 'కట్టు'..

సర్జరీ చేస్తాం, అవసరమైతే చెయ్యి తొలగించాల్సి వస్తుందని చెప్పి తమ నుంచి సంతకాలు తీసుకున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద సర్జరీ చేస్తామని చెప్పి వివరాలు తీసుకున్నట్టు చెప్పారు. చేతికి స్కిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సి వస్తుందని మరోసారి సంతకాలు తీసుకున్నట్టు వివరించారు. 6వ అంతస్థులోని ప్లాస్టిక్ సర్జరీ ఆపరేషన్ థియేటర్‌కు రోగిని తీసుకెళ్లి, రక్తం ఇచ్చిరావాలని తమను కిందికి పంపారని తెలిపారు. ఆరుగురు బ్లడ్‌బ్యాంక్‌లో రక్తం ఇచ్చి అరగంటలోపు 6వ అంతస్థుకు రాగా అక్కడ రోగి కనిపించలేదని, ఆపరేషన్ అయిపోయింది, 7వ అంతస్థులోని వార్డుకు పంపామని చెప్పడంతో వెళ్లి చూసేసరికి బెడ్‌పై పడుకొని ఉన్నదని చెప్పారు. చేతికి పట్టీ ఉండడంతో తాము కూడా ఆపరేషన్ అయిపోయిందని నమ్మినట్టు వాపోయారు.

నొప్పి వచ్చినా పట్టించుకోకపోవడంతో..

రోజులు గడిచినా నొప్పి తగ్గకపోవడంతో వైద్యసిబ్బందికి చెప్పినా వారు పట్టించుకోలేదని, ఈనెల 28న అక్కడి నుంచి ఇంటికి తీసుకొచ్చామని, 29న జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లామని తెలిపారు. అక్కడి సిబ్బంది బ్యాండేజ్‌ను తీసి చూసి అసలు సర్జరీ చేసిన ఆనవాళ్లే లేవని చెప్పారని, చెయ్యి పూర్తిగా కుళ్లిపోయిందని, వేరే దవాఖానకు తీసుకెళ్లాలని చెప్పారని వాపోయారు. దీంతో 30న మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు వెళ్లినట్టు తెలిపారు. రోగిని పరిశీలించిన అక్కడి వైద్యులు చెయ్యిని తొలగించాల్సి వస్తుందని, ద